

# నేనే నా ఆయుధం

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్థ గాథ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు...
కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో
చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు...
విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...
ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..!
పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన
ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!
ప్రతీ నిరుద్యోగి, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న
ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్
**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 14

ఒకరోజు నాకు ఒక నాయకుడి దగ్గర్నుంచి పిలుపు వచ్చింది. విశ్వరూపం సినిమాలో గూఢచారి కమల్ హాసన్ బిన్ లాడెన్‌ని కలుసుకుంటాడు. (సినిమాలో అతడు బిన్‌లాడెన్ అని చెప్పలేదు కానీ ఆ విధంగా మేకప్ చేసారు). నా పరిస్థితి కూడా అదే.

అన్నలనగానే ఆజానుబాహువులు అనుకుంటాము. కానీ మనిషి చాలా సన్నగా, పీలగా ఉన్నాడు. కళ్ళలో తేజస్సు ఉంది. పేరు తెలీదు. ఆ నాయకుడిని చూడగానే మనసంతా ఉద్విగ్నంగా మారింది.

ఆయన నాతో ఈ విధంగా అన్నాడు: "సిద్ధాంతాన్ని బలంగా నమ్మే నక్సలైట్లు తగ్గిపోతున్నారు. అన్నల పేరు చెప్పి మందూ పబ్బం గడుపుకుంటూ సొమ్ము చేసుకునేవారు ఎక్కువ అవుతున్నారు. వీళ్ళు చీడపురుగులు. నిజానికి పోలీసులకంటే వీళ్ళే ప్రజలకీ, అన్నలకీ నిజమైన శత్రువులు."

మౌనంగా వింటున్నాను.

"ప్రజలకి నిజమైన సిద్ధాంతం గురించి వివరించ వలసిన బాధ్యత చాలా ఉన్నది. రామ్మూర్తి నీ గురించి చెప్పాడు. నువ్వు ఈ సంస్థకు పనికి రావు. నీకు బంధాలెక్కువ. మాటల్లో దిట్టవనీ, ఏ విషయాన్నైనా తెలివిగా ఆలోచిస్తావనీ కూడా చెప్పాడు. నీలో మేధావితనం ఉంది. డైరెక్టుగా ఈ కార్యకలాపాల్లో పాల్గొనకుండా, నీ ఆలోచన్లు పదిమందికీ పంచితే సమాజానికి ఇంకా ఎక్కువ మంచి జరుగుతుందని నేను అనుకుంటున్నాను. కాబట్టి ఇక్కడితో దీనికి స్వస్తి పలికి జన స్రవంతిలోకి వెళ్ళిపోయి యువకుల్ని ఉత్తేజవంతులని చేయి" అని సలహా ఇచ్చాడు.

అక్కడి నుంచి వచ్చేస్తూ ఆలోచన్లో పడ్డాను.

ఆయన చెప్పిన మాటల్లో ఎంతో వాస్తవం ఉంది. చాలా మంది విలాసాల ఖర్చుల కోసం నక్సలైటు ముసుగు వేసుకుంటున్నారు. మరి కొందరు నమ్మిన సిద్ధాంతం వదిలి పెట్టి, పక్కా కాపిటలిస్టులు అవుతున్నారు.

అంత వరకూ ఎందుకు?

అప్పట్లో రాడికల్ భావాలతో చెలరేగిపోయిన వారిలో చాలమంది ఇప్పుడు వ్యాపారవేత్తలుగా, టీ.వీ చానల్స్ యజమానులుగా, పెద్ద పెద్ద రాజకీయ నాయకులుగా ఎదగటం(!) మనకి తెలుసుగా.

వ్యాపారాలు పెట్టి, వీధికి ఇరువైపులా బహుళ అంతస్తుల భవనాలు కట్టి, ఆ వీధికి 'కార్ల్ మార్క్స్' మహనీయుడి పేరు పెట్టటం మనకే చెల్లింది.

ఈ విధమైన పరస్పర విరుద్ధమైన సంఘర్షణలతో కొట్టుమిట్టులాడుతూ ఉండగా ఊహించని సంఘటన జరిగింది.

ఇనస్పెక్టర్ మరణంతో రెచ్చిపోయిన పోలీసులు, దాన్నొక సవాలుగా తీసుకుని జల్లెడ వేసి రామ్మూర్తిని పట్టుకుని, ఎన్‌కౌంటర్‌లో చంపేసారు.

నాకు అన్నలతో పెద్దగా సంబంధం లేదు. అయినా రామ్మూర్తి స్నేహితులందర్నీ అరెస్ట్ చెయ్యాలనే దృఢసంకల్పంతో పోలీసులు ఉన్నారని తెలిసి, రూం ఖాళీ చేసి మా పల్లెకి వెళ్ళి పోయాను.

మళ్ళీ కుటుంబ బంధాలు పెనవేసుకున్నాయి. తేలు కుట్టినప్పుడు పెళ్ళిలో అక్కలు చేసిన హడావుడి, ఇల్లు వదిలిపోయిన చిన్నన్నయ్యని గుర్తు చేసుకుంటూ అర్ధరాత్రి నిద్ర లేచి అమ్మ బిగ్గరగా రోదించటం... అమ్మా, అక్కా బావ, అన్నా వదినల ప్రేమలు, నాయకుడి సలహా... అన్నీ కలిసి నన్ను ఉద్యమానికి దూరంగా వచ్చేలా చేసాయి.

ఆ తరువాత అన్నలతో సంబంధం పూర్తిగా తెగిపోయింది.

# 15

తిరిగి నా అందమైన శత్రువు (ప్రేయసి) 'ఇంగ్లీషు'లోకి వస్తాను.

ఇంగ్లీషు పట్ల నా భయం డిగ్రీకొచ్చినా పోలేదు. వ్రాస్తే 'సున్నా' కన్నా ఎక్కువ మార్కుల రావని తెలిసి డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్ష వ్రాయలేదు.

ఒక రోజు మా ఊరు వెళ్ళటం కోసం వరంగల్ ఎం.జి.ఎం. బస్‌స్టాపులో నిలబడ్డాను. నా స్నేహితుడు నా పక్కనే ఉన్నాడు. బస్సు రావటానికి ఇంకో గంట సమయం ఉంది. "గంట సేపూ ఎండలో నిలబడటం ఎందుకురా" అని ఎదుటి బిల్డింగ్ చూపించాడు. అదొక కంప్యూటర్ కోచింగ్ సెంటరు.

"అక్కడకు వెళితే ఏ.సి.లో కొద్దిసేపు కూర్చోవచ్చు. చిన్న నాటకం ఆడదాం పద" అని తీసుకెళ్ళాడు.

లోపల ఒక అందమైన అమ్మాయి రిసెప్షన్‌లో కూర్చుని ఉంది. మమ్మల్ని చూసి నవ్వుతూ, అద్భుతమైన ఇంగ్లీషు ఆక్సెంట్‌తో "Please take your seat" అంది.

కుర్చీని ఎక్కడికి తీసుకెళ్ళాలో తెలియక పక్కకు జరిపాను. కూనూరు స్టాండర్డు ఇంగ్లీషు మరి...!

"Sit down" అంది.

ఆమె ఏమి చెపుతోందో అర్థమై, అప్పుడు కూర్చున్నాను. ఆమె మాకు రెండు కాగితాలిచ్చి ఫారంలు నింపమని చెప్పింది. నాకొద్దిగా ABCDలు తెలుసు. నా స్నేహితుడికి అది కూడా రాదు. వెర్రిమొహం వేసుకుని చూస్తున్నాడు.

నిజానికి ఆ కాగితాలు 'మీరిక్కడకు ఎలా వచ్చారు? పేపర్ చదివి వచ్చారా? మా ప్రకటన చూసి వచ్చారా?' లాంటి ప్రశ్నలకి టిక్ చేయవలసిన కాగితాలు.

వాటిని అడ్మిషన్ ఫారంలు అనుకొని "నో అడ్మిషన్" అన్నాను.

ఆ అమ్మాయి"No problem. " అంది.

"No money" అన్నాను.

"ఇవి పూర్తి చేయటానికి డబ్బులు అక్కరలేదు. Fill it" అంది.

'No admission అంటే Fill it అంటోంది. ఈ అమ్మాయికి బుర్ర పనిచేయదా?' అని తిట్టుకున్నాను.

మళ్ళీ "Please fill it. It would help us. You don't lose anything by it" అంది.

'నింపటం-సాయం' అన్న పదాలు కాస్త అర్థం అయ్యాయి. మేము ఏమి(?) నింపితే ఆమెకి ఏమి(!) లాభమో అర్థం కాలేదు.

భయం వేసి చెమటలు పట్టాయి. గొంతు తడారిపోయి దాహం వేసింది.

"వాటర్" అన్నాను.

ఆ అమ్మాయి నీళ్ళ కోసమని పక్కన ఉన్న వాటర్ కాన్ దగ్గరకు వెళ్ళింది. తిరిగి వచ్చేలోపు ఆ కాగితాలు పట్టుకుని వెనక్కి చూడకుండా వేగంగా బయటకు వచ్చేసాము.

కాస్తయినా ఇంగ్లీష్ నేర్చుకోకపోతే అవమానాల పాలు కాక తప్పదన్న అనుభవం అప్పుడే కలిగింది. మా ఊరొచ్చి ఆ రాత్రి పడుకున్న తర్వాత నా చర్య నాకే రోతగా అనిపించింది.

రాళ్ళు పెట్టి బస్సుల్ని ఆపాను. సినిమా హాలు వాడిని ఎదిరించాను. పక్క ఊరి రౌడీలతో పోరాడాను. అడవుల్లో తిరిగాను. అన్నల్ని కలిసాను. అప్పటివరకూ ఎంతో ధైర్యంతో ఉన్న నేను, ఒక ఆడపిల్ల ముందు అంత బెదిరిపోవటానికి కారణం 'ఇంగ్లీష్ రాకపోవటమే' కదా అనిపించింది.

ఆ రాత్రి నాకు నిద్ర పట్ట లేదు. నా జీవితంలో పెద్ద మార్పుకి అంకురం బహుశా అప్పుడే పడి వుంటుంది...!

ఇంగ్లీష్ నేర్చుకోవాలనే తపన ప్రారంభమైంది. కానీ ఏమి చెయ్యాలో తెలీదు.

ఆ విధంగా నేను అయోమయంలో ఉండగా స్పోకెన్ ఇంగ్లీష్ సంస్థలో చేరమని ఎవరో సలహా ఇచ్చారు.

---

ఆ రోజుల్లో వరంగల్‌లో దామోదర్ సార్ సంస్థ చాలా గొప్పది. చాలా పెద్ద స్టాండర్డ్ ఉన్న సంస్థ. అక్కడకు వెళ్ళి వాకబు చేస్తే నాలుగు వందల యాభై రూపాయలు కట్టాలని చెప్పారు. నా దగ్గర అంత డబ్బు లేదు.

కాకరకాయలు కొనేవాళ్ళు నా దగ్గర బేరమాడటం తెలుసు.

"రెండొందలకి చెప్తారా?" అని అడిగాను.

"పక్క వీధికి వెళ్ళు. చెబ్తారు" అన్నాడు.

గమ్మత్తేమిటంటే, అందులో వెటకారం ఉందనుకోలేదు. నాకు మాట సాయం చేస్తున్నాడనుకుని పక్క వీధికి వెళ్ళాను.

నిజంగానే అక్కడో చిన్న స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పే సంస్థ ఉంది. మొత్తం ఫీజు ఒకటేసారి కట్టక్కరలేదని భరోసా ఇచ్చారు. అమ్మనడిగి వంద రూపాయలు తీసుకొని ఆ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను.

మొట్టమొదటిరోజు ఆమె నౌన్, ప్రొనౌన్ మొదలైనవన్నీ చెప్పింది. నౌన్ గురించి చెపుతున్నంతసేపూ స్ట్రెయిన్ అనిపించింది. ఆ పై రోజు ఆమె వాయిస్‌ల గురించి చెప్పింది. మధ్యలో వెళ్ళిపోవటానికి ఛాయిస్ లేదు. వెర్బ్‌ల గురించి చెపుతూంటే, గతంలో దొంగలించిన బల్బుల గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఒక్క ముక్క అర్థం కాలేదు. అంతా అయోమయంగా తోచింది. ఆ పాఠాలు నా స్టాండర్డ్‌కి చాలా ఎక్కువ. అనవసరంగా చేరానా అనిపించింది.

నాలుగు రోజుల తర్వాత, ఆమె విద్యార్థులందరినీ లేచి తమను తాము పరిచయం చేసుకోమని చెప్పింది. నా ముందు మాట్లాడిన ఇద్దరూ కాస్త ఇంగ్లీషులో ఏదో తమ గురించి చెప్పుకున్నారు. నేను వెళ్ళి తెలుగులో మాట్లాడటం మొదలుపెట్టాను. "ఇంగ్లీష్...ఇంగ్లీష్..." అందామె.

తెలుగులోనే మాట్లాడటం కొనసాగించాను.

"ఇంగ్లీషులో మాట్లాడు" అన్నదామె.

"ఆమాత్రం ఇంగ్లీష్ వస్తే నేనిక్కడ ఎందుకు చేరతాను మేడం" అన్నాను. క్లాసు ఘొల్లుమంది.

ఆమె కోపంగా చూడలేదు. అర్థమైనట్టు తలాడించి 'అవును కదా' అంది.

నేనే చాలా సిగ్గుగా ఫీలయ్యా. ఆమె తల్చుకుంటే తిరిగి మాటకి మాట అనవచ్చు. లేదా నన్ను కూర్చోమని గద్దించవచ్చు. అదేమీ చెయ్యలేదు.

ఆమె పై నాకు గౌరవం పెరిగింది.

ఆ తర్వాత నాలుగు రోజులు అయిపోయాయి. నాకో విషయం అర్థమైంది. ప్రాక్టీసు చెయ్యకుండా కేవలం కోర్సులు వినటం వల్ల ఏమీ లాభం లేదని తెలిసి పోయింది.

నా క్లాసులో ముగ్గురు ఉండేవారు. ఒకరు ప్రసాద రాజు. రెండు శ్రీధర్. మూడు శ్రీనివాస్.

మొదటి వాళ్ళిద్దరూ అప్పటికే పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు. ఇంగ్లీషు బాగా మాట్లాడేవారు. వాళ్ళని టీకి పిలిచి, బిల్లు కూడా నేనే ఇచ్చి పరిచయం చేసుకున్నాను. వాళ్ళతో మాట్లాడుతూ నా ఆంగ్ల భాషా పరిజ్ఞానం పెంచుకోవాలని ఆశ.

కానీ వాళ్ళ పరిచయంలో నాకు అర్థమయిందేమిటంటే... 'నాకన్నా కింద స్థాయిలో ఇంకొకరుంటే తప్ప నేను 'పై'వాళ్ళతో స్నేహం కొనసాగించలేను' అని..!

గ్రూప్ అసోసియేషన్‌లో ఇది చాలా ముఖ్యం. మన స్నేహ బృందంలో మన కన్నా తక్కువ స్టాండర్డ్ ఉన్నవాళ్ళు లేకపోతే, పై వాళ్ళు వేసే జోకులకి మనం బక్రాలైపోతాం.

ఆ సమయంలో నాకు మూడో వ్యక్తి శ్రీనివాస్ దొరికాడు. శ్రీనివాస్ కరాటేలో బ్లాక్ బెల్టు. లావుగా పొడుగ్గా, నల్లగా ఉన్నా అందంగా ఉండేవాడు. అతని మీద జోకులెయ్యటానికి ఎవరూ సాహసం చెయ్యలేరు. అతన్ని మా గ్రూపులో కలపటానికి ప్రయత్నం చేశాను.

నేనూ శ్రీనివాస్ బాగా దగ్గరయ్యాము. మేము నలుగురం కలిసి ఒక బ్యాచ్‌గా ఏర్పడ్డాం.

ఆ తర్వాత నేనే ప్లాన్ చేసి వాళ్ళను వేయి స్తంబాల గుడికి తీసుకెళ్ళాను. మాటల మధ్యలో నేనొక ప్రపోజల్ పెట్టాను.

"మనం ఇంగ్లీష్ నేర్చుకోవాలంటే ఈ రోజు నుంచీ ఇంగ్లీషులోనే సంభాషించుకోవాలి. తప్పైనా, రైటైనా ఇంగ్లీషులోనే మాట్లాడుకుందాం. మాట్లాడేవారిలో తప్పు ఉన్నదని మన ముగ్గురిలో ఎవరికైనా తెలిస్తే కరెక్ట్ చేద్దాం. లేదంటే అది కరెక్టే అనుకుందాం" అనే ఒప్పందం చేసుకున్నాం.

గుళ్ళో ఒకరి మీద ఒకరు ఒట్లు వేసుకున్నాం.

అందరం చాలా ఉద్వేగంగా ఫీలయ్యాం.

మా క్లాస్ నాలుగు నుంచి అయిదు వరకూ ఉండేది. క్లాస్ అయిపోగానే వేయి స్తంబాల గుడికి వెళ్ళి పోయే వాళ్ళం.

మాలో శ్రీధర్ ఆర్.ఎస్.ఎస్.ను బలపరచేవాడు. ప్రసాదరాజు కాంగ్రెస్ అభిమాని. నావి నూటికి నూరుపాళ్ళూ కమ్యూనిస్టు సిద్ధాంతాలని వేరే చెప్పక్కర్లేదు కదా. శ్రీనివాస్‌కు బలప్రయోగమూ, కరాటే తప్ప మరో టాపిక్ ఉండేది కాదు.

ఈ విధంగా నలుగురం, సిద్ధాంతాల విభేదాల చర్చల మాటల తూటాలతో కొట్టుకునేవారం. ఇంగ్లీష్ తప్ప మరేం మాట్లాడకూడదన్న ఒప్పందం ప్రకారం ఈ సిద్ధాంత చర్చలన్నీ ఇంగ్లీషులోనే జరిగేవి. ఆశ్చర్యవశాత్తూ, అదృష్టవశాత్తూ క్రమక్రమంగా మాకు తెలీకుండానే ఇంగ్లీషులో మాట్లాడే ధైర్యం వచ్చేసింది.

నేను పక్కా కమ్యూనిస్ట్‌ని అవటంతో సహజంగా ఉద్వేగం పాలు ఎక్కువ. ఆవేశంతో గట్టిగా ఇంగ్లీషులో అరుస్తున్నప్పుడు (ఇంగ్లీష్‌లో అరవటం ఏమిటి? ఇంగ్లీష్‌లో అరవటం, తెలుగులో అరవటం అని వేరేవేరేగా ఉంటాయా – అన్న అనుమానాలు వద్దు. ఏదో ఆవేశంలో నా కథ చెప్పుకు పోతున్నానంతే), అలా అరుస్తున్నప్పుడు, వాళ్ళు చర్చ మానేసి, నా తప్పులు దిద్దటం మొదలు పెట్టేవారు.

ఆ రకంగా నెల రోజులు తిరిగేసరికి, ఇంగ్లీష్ మాట్లాడుతున్నపుడు నేను చేస్తున్న తప్పులు తెలిసాయి. వామపక్షభావాలతో వాళ్ళని ఎంత బలంగా ఒప్పించ గలిగానో, అంత బలంగా ఇంగ్లీషులో కూడా వాళ్ళని అధిగమించ సాగాను.

కొంతకాలానికి మాకు లొకేషన్ బోరుకొట్టి, భద్రకాళి గుడికి మకాం మార్చాం. ఎక్కువ ప్రాపంచిక విషయాలు మాట్లాడుకొనేవాళ్ళం. కానీ ఏది మాట్లాడినా ఇంగ్లీషులో మాట్లాడాలనే మా ఒప్పందం మాత్రం ఆ విధంగానే కొనసాగింది.

పిచ్చితనమనుకోండి, ఏదైనా అనుకోండి. మేము చిన్న చిన్న ప్రయోగాలు కూడా చేసేవాళ్ళం. ఆర్.టి.సి బస్సు ముందు వైపు నుంచి ఇద్దరమూ, వెనక వైపు నుంచి మరో ఇద్దరమూ ఎక్కి కూర్చొని మధ్యలో ప్రయాణీకులు వినేలా ఇంగ్లీషులో బిగ్గరగా మాట్లాడుకొనేవారం.

'మేము మాట్లాడుకొనే దాంట్లో ఏదైనా తప్పులున్నాయా? ఎవరైనా నవ్వుతున్నారా? మా వైపు విచిత్రంగా చూస్తున్నారా?' అని గమనించేవాళ్ళం.

చాలా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఎవరూ నవ్వేవారు కాదు. మా వైపు విభ్రమంగా చూసేవారు. దాంతో మా మీదా, మా ఇంగ్లీషు మీదా కొద్దికొద్దిగా నమ్మకం పెరగసాగింది.

ఒకటే హొటల్‌లో దూరంగా ఉన్న వేర్వేరు టేబిల్స్ మీద కూర్చుని ఇంగ్లీషులో మాట్లాడుకొనేవారం.

ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది కానీ ఆ రోజుల్లో చాలా థ్రిల్లింగ్‌గా అనిపించేది. పదిమందిలో ఇంగ్లీషులో మాట్లాడితే అందరూ మన వైపు మెచ్చుకోలుగా చూస్తారనే ఒక భావం బహుశ అప్పుడే కలిగి ఉంటుంది.

మా మకాం పబ్లిక్ గార్డెన్స్‌కి మారింది. అక్కడ జనమంతా వింటూండగానే కావాలని ఇంగ్లీషులో మాట్లాడేవాళ్ళం. జనాల మీద కామెంట్స్ చేస్తూ (అఫ్‌కోర్స్. పాజిటివ్ కామెంట్స్) వాళ్ళు మా వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉంటే, మేమేదో ఆకాశం నుంచి దిగిన వాళ్ళలాగా ఫీలవసాగాం.

ఇప్పుడు మా సంస్థకొస్తున్న చాలామంది విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకానికి అట్ట వేసుకుంటారు. తాము ఫలానా కోర్సులో చదువుతున్నామని చెప్పటానికి నామోషీగా ఫీలవుతారు. ఇది చాలా తప్పని నా అభిప్రాయం.

నేనెప్పుడూ ఆ విధంగా అనుకొనేవాడిని కాదు. ఇంగ్లీష్ నేర్చుకోవటం నా బాధ్యత. నేను ఇంగ్లీష్ నేర్చుకోవటంలో ఆనందం పొందుతున్నాను. చుట్టుపక్కల ఉన్నవాళ్ళు ఏమనుకున్నా నాకనవసరం.

ఏదయినా కొత్త పదం కానీ, కొత్త ఫ్రేజ్ గానీ వినబడితే, దాన్ని వీలైనంత ఎక్కువగా వాడటం అలవాటు చేసుకున్నాను. ఒక రోజు ప్రసాదు ఇన్‌స్టిట్యూట్‌కి సెలవు పెట్టి, క్లాస్ అయిపోయక గుడికి వెళ్ళటం కోసం వచ్చాడు.

"I came just for the sake of you" అన్నాడు.

ఈ 'For the sake' అనే పదం నాకు విచిత్రంగా వినిపించి, దాన్ని విపరీతంగా వాడటం ప్రారంభించాను. అవసరం ఉన్నా లేక పోయినా "I came for the sake of learning english", "I came for the sake of taking tea" లాంటి వాక్యాలు ఉపయోగించటం మొదలుపెట్టాను. ఇలాంటి కొత్త ఫ్రేజ్‌లు వాడటంతో, వినేవాళ్ళకి నాకేదో అద్భుతమైన ఇంగ్లీష్ వచ్చనే అభిప్రాయం కలిగేది. ('For the sake of you' కన్నా 'For your sake' అనేది మంచి ఇంగ్లీషు అని తరువాత తెలిసింది).

---

భాష బాగా వచ్చిన వాళ్ళు చాలా సింపుల్ ఇంగ్లీషులో మాట్లాడటం మనం గమనించవచ్చు. నిండు కుండలు తొణకవు. కానీ నా పరిస్థితి అది కాదు. అప్పుడప్పుడే ఇంగ్లీషు మాట్లాడటం వస్తూన్న రోజులవి. అందుకని అవసరమున్నా లేక పోయినా పాండిత్య ప్రకర్ష చేసేవాడిని. అందులో చిన్న చిన్న ఎదురు దెబ్బలు కూడా తగిలేవి.

ఒక రోజు క్లాసు జరుగుతూ ఉండగా ప్రసాదు దగ్గరకు వెళ్ళి ఇంగ్లీషులో "నాకు ఓ పేపర్ ఇవ్వు" అన్నాను.

"ఒక పేపర్ అనకూడదు. ఒక sheet of paper అనాలి" అన్నాడు. పరిచయమైన పదాన్ని తరచు వాడటం అలవాటు చేసుకుంటానని చెప్పాను కదా. మరుసటి రోజు మేడమ్‌తో అప్పుడే లండన్ నుంచి దిగిన వాడిలా, "please give me two sheet of papers" అన్నాను.

"Sheet of papers కాదు. Sheets of paper అనాలి" అన్నది.

సున్నం నీళ్ళలో మొహం ముంచినట్టయ్యింది.

---

బస్‌స్టాప్‌లో నిలబడినప్పుడు నాలో నేనే ఇంగ్లీషులో మాట్లాడుకొనేవాడిని.

"The same bus came yesterday. But the driver was different. Conductor was different. దీన్నే ఇంకొంచెం సింప్లిఫై చేసి బాగా చెప్పొచ్చు కదా.

It is the same bus, but the driver and conductor were different" అనుకునేవాడిని.

"Girls get into the bus from the front door. Boys from the back-door. To make it better: 'Girls enter the bus... or step into the bus... from the front door, and the boys from the rear-door".

"In the bus అనాలా? Into the bus అనాలా?" అని సలహా తీసుకునేవాడిని.

"Boys love to hang-on the foot board. This word "hang-on" can be replaced by "Hold on... stick on... cling on" అని సరిదిద్దుకునే వాడిని.

"Some people buy the ticket, some people don't. దీన్నే వేరే రకంగా అనాలంటే "Many passengers purchase the tickets but some don't" అంటూ పాత పదాలను కొత్త వాటితో రీ-ప్లేస్ చేయటానికి ప్రయత్నించేవాడిని.

నాకు తెలిసిన ఒక తర్కం ఏమిటంటే ఈ ప్రపంచంలో ఏది మాట్లాడినా గతం, వర్తమానం, భవిష్యత్తు (Past, Present, Future) మీదే ఆధారపడి ఉంటుంది. Past Tense లో జరిగిన విషయాల గురించి; Present Continuous Tense లో జరుగుతున్న విషయాల గురించి; Future tense లో రేపటిని ఊహించుకొని చెప్పుకొనే వాడిని.

ఒక సందర్భాన్ని ఊహించుకొని దాన్ని మూడు కాలాల్లోనూ మాట్లాడేవాడిని.

Passenger bus comes here every day. It came yesterday. It is coming now. Tomorrow the same bus will come. But different people will get off.

ఇదంతా మంచి ఇంగ్లీషు కాదు కానీ, తప్పటడుగులు వేసే వాడి నుంచి మారథాన్ పరుగు ఆశించలేము కదా. మొదట్లో మనని కొంతమంది ఎగతాళి చేస్తారు. కానీ వాళ్ళే మన తపన చూసి తరువాత మెచ్చుకుంటారు.

ఎదురుగా ఉన్న ప్రతీ వస్తువు కూడా నేను మాట్లాడటానికి ఒక కథాంశం అయ్యేది. ఉదాహరణకి ఒక పెన్ తీసుకున్నాం అనుకోండి. నాలో నేనే "I can use this pen for writing, to scratch my head, to beat somebody for his attention. I can put it in my shirt pocket, but not in my pant's back pocket. I can use it for a month, But not for one year" అనుకొనేవాడిని.

ఒక పెన్నుతో ఇలా ఎన్ని వాక్యాలు తయారు చేసుకోవచ్చో ఆలోచిస్తూ ఉండేవాడిని.

---

చిన్న పిల్లవాడు తప్పటడుగులు వేస్తూ వేస్తూ ముందుకు తూలితే తల్లిదండ్రులు ఫక్కున నవ్వుతారు. చెయ్యి అందించి పైకి లేపుతారు. వాడు నిలదొక్కుకుని నాలుగు అడుగులు వేస్తే, సంభ్రమంతో చప్పట్లు కొడతారు. నాకూ అలాగే జరిగింది.

నా మిత్రులలో వస్తున్న తేడా కొంతకాలానికి గమనించాను. నేను తప్పటడుగులు వేస్తూ నడుస్తూంటే "షేక్‌స్పియర్ వస్తున్నాడ్రా" అంటూ నవ్విన వారందరూ, నన్ను ఆశ్చర్యంతో గమనించటం చూశాను. నా మీద నాకు సంపూర్ణ విశ్వాసం కలిగింది.

అంతవరకూ ఎందుకు?

నేను మాట్లాడే ఇంగ్లీష్ విని మా బావ, అక్క, అమ్మ... వీరందరూ నాలో వస్తున్న మార్పుని ఆశ్చర్యంతో గమనించటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చేది.

నేను కాలేజీలో చేరినప్పుడు నాకు తన ఫ్యాంట్లు ఇచ్చిన బావ గురించి ఇంత క్రితమే ప్రస్తావించాను. ఆయన గిరిజన్ కో–ఆపరేటివ్ కార్పొరేషన్‌లో పనిచేసేవాడు.

ఒకరోజు నన్ను పిలిచి "ఒరేయ్. నువ్వు ఇంగ్లీషులో ఏమీ రాని స్థాయి నుంచి ఇలా ఇంతవరకూ ఎలా వచ్చావో మెట్టు తర్వాత మెట్టు ఒక వ్యాసంలా వ్రాసివ్వరా. నేనూ నేర్చుకుంటాను" అన్నారు.

నాలాంటి వాడికి అంతకన్నా గొప్ప అభినందన ఇంకేమి ఉంటుంది? దాదాపు రెండు నెలలు కూర్చుని ఒక పుస్తకం మీద రకరకాల స్కెచ్ పెన్నులతో వ్రాయటం మొదలుపెట్టాను. గ్రామర్ నుంచీ సంభాషణల వరకూ దాదాపు వందపేజీల పుస్తకం తయారయింది.

ఆ పుస్తకం ఆయన తీసుకెళ్ళి ఆఫీసులో చూపించినప్పుడు మేనేజర్ నుంచీ ఆఫీసులో దాదాపు ప్రతివారూ దాన్ని జెరాక్స్ కాపీలు తీసుకొని ఉంచుకున్నారు.

విజయానికి అది తొలిమెట్టు. అప్పటి వరకూ మాట్లాడటం నేర్చుకున్న నాకు, మా బావ అడిగిన పుస్తకం వ్రాయటం మొదలుపెట్టాక "మాట్లాడటం వేరు. వ్రాయటం వేరు" అన్న విషయం అర్థమయింది.

మాట్లాడేటప్పుడు ఇంగ్లీష్ ఒక రకంగా ఉండాలి. వ్రాసేటప్పుడు ఒక రకంగా ఉండాలి. వ్రాయటం ప్రాక్టీసు చేస్తున్నప్పుడు నేను ఈ రకమైన మెళకువలు చాలా నేర్చుకున్నాను.

కొంతకాలానికి నేను ఇంగ్లీషుతో మమేకం చెందసాగాను. రాత్రిపూట అమ్మాయిల గురించి ఆలోచించినా సరే, ఆ ఆలోచనలన్నీ ఇంగ్లీషులోనే సాగేవి. ఇంగ్లీషు నా రక్తంలో కొద్దికొద్దిగా ప్రవేశించి, ఒక స్థాయికొచ్చేసరికి అది తప్ప మరింకేమీ లేదు అన్న ఒక తదాత్మ్యభావం నాలో కలిగింది.

ఈ లోపు మా కోర్సు ఆఖరి రోజు సమీపించింది.

ఫేర్‌వెల్ పార్టీలో అందర్నీ మాట్లాడమన్నారు. అభివృద్ధి, అనుభవాలు చెప్పమన్నారు. మా బ్యాచ్‌లో మాట్లాడినవారందరూ grammar, verbs, phrases ఇవన్నీ ఆలోచించుకుంటూ ఆచి తూచి మాట్లాడారు. చివరికి నా వంతు వచ్చింది.

మాట్లాడటం మొదలు పెట్టాను. నా మనసులోని భావాలన్నీ స్పష్టంగా... ఏమాత్రం తప్పులు లేకుండా... నాకు తెలిసినంతలో ఒక అద్భుతమైన స్పీచ్... పదిహేను నిముషాలపాటూ ఇచ్చాను.

నా ఉపన్యాసం అయ్యేసరికి అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు. మా మేడం నా వైపు కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది. అది ఆశ్చర్యమో ఆనందమో తెలీదు.

ఉపన్యాసం అయిపోయాక దగ్గరకొచ్చి, "చిరంజీవీ, నేను పది సంవత్సరాల నుంచీ కొన్ని వందల మంది విద్యార్థులకి ఈ కోర్సు చెప్పి ఉంటాను. కానీ, ఒక ముడి పదార్థంగా వచ్చి, గొప్ప ప్రొడక్ట్‌గా బయటకి వెళుతున్న మొట్టమొదటి విద్యార్థివి నువ్వేనయ్యా" అన్నది.

ఎందుకో తెలీదు కానీ నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. హిమాలయ పర్వతాలు ఎక్కినంత సంతోషం కలిగింది.

సర్టిఫికేట్ మీద సంతకం పెడుతూ "ఈరోజు నాకో నమ్మకం వచ్చింది..! ఎవరికైనా ఇంగ్లీషు చెప్పగలనన్న నమ్మకం" అన్నదామె.

నిజానికి ఆ నమ్మకం ఆమెకు కాదు. నా మీద నాకు కలిగింది.

...

ఈ మూణ్ణెల్ల కాలంలో మనసులో ఒకటే ఆలోచన. ఏ అమ్మాయి దగ్గర ఇంగ్లీషులో మాట్లాడటానికి భయపడి పేపరు జేబులో పెట్టుకొని ఇంటికి వచ్చానో, ఆమె దగ్గరకు వెళ్ళి ఆంగ్లంలో అదరగొట్టేయాలని..!

దానికి ముందు మానసికంగా ప్రిపేరవటం కోసం నా మేనల్లుడిని తీసుకొని వరంగల్‌లో పది కంప్యూటర్ సెంటర్లకు వెళ్ళాను.

"మా వాడిని ఇక్కడ చేర్పించాలి. మీ ఫార్మాలిటీస్ ఏమిటి?" అని ఇంగ్లీషులో అదరగొట్టేశాను. నా ఇంగ్లీషు చూసి వారు ఎంతో గౌరవంతో, వినమ్రతతో సమాధానమిచ్చేసరికి నేనంటే నాకే ముచ్చటేసింది.

నాతో నీళ్ళు తాగించిన (నిజంగానే మంచినీళ్ళు తాగించిన) ఆ అమ్మాయి ఇన్‌స్టిట్యూట్‌కి ముహూర్తం చూసుకొని వెళ్ళాను.

రిసెప్షనిస్టు స్థానంలో ఆ అమ్మాయి లేదు.

ఆ అమ్మాయి రిసెప్షనిస్ట్ కాదనీ, ఆ సంస్థ యజమాని కూతురనీ, పెళ్ళయి వెళ్ళిపోయిందని తర్వాత తెలిసింది.

ఆ అమ్మాయి ప్రస్తుతం ఎక్కడుందో? బహుశ అమ్మమ్మో, నాయనమ్మో అయి ఉంటుంది. కానీ నాలో ఇంగ్లీష్ పట్ల కోరికను పెంచినందుకు ఆమెకు మనసా వాచా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)